సాక్షి అనంతపురం

సోమవారం । 22 । జూలై । 2024



'దుర్గం'పై 'ఏసీబీ' కన్ను

కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8లో



అరుదైన పంటలు.. అద్భుత లాభాలు

ఒక్కసారి మొక్క నాటితే ఏళ్ల తరబడి లాభాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూర సాగుతో అనంత జిల్లా రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.9°/22.3°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పోలీసుల సంక్షేమమే ధ్యేయం

- ఎస్పీ మురళీకృష్ణ



ఈ- సర్వైలెన్స్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనంతపురం: పోలీసుల సంక్షేమమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో పోలీసుల సంక్షేమార్థం అమలవుతున్న కార్యక్రమాలపై ఎస్పీ ఆరా తీశారు. పోలీసు కన్వెన్షన్ హాల్, పోలీసు కాంప్లెక్స్, పోలీసు పెట్రోల్ బంకు, వాటర్ ప్లాంట్, డాగ్ స్క్వాడ్, జిమ్, ఇండోర్ స్టేడియం, సీపీసీ క్యాంటీన్, రామాలయం, షాదీఖానా, ఈ– సర్వైలెన్స్ సెంటర్, పీసీఆర్, సైబర్ సెల్, డయల్ –100 కేంద్రాలను పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆయనతో పాటు అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐలు రాముడు, మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, తదితరులు ఉన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఐటీఐలలో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ సి.రామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి ఈనెల 27న, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు 29న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న ప్రతి విద్యార్థి ఆయా తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

అరటి సాగుపై రేపు అవగాహన సదస్సు



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఏఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం అరటి సాగుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిరోజ్ ఖాన్, శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, బీకేఎస్ మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అరటి సాగులో మెలకువలు తెలియజేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అనంతపురంలో ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తజనం



భక్తులతో కిక్కిరిసిన రాయదుర్గంలోని సాయి ఆలయం

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

జిల్లావ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయినాథుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సాయి నామస్మరణతో జిల్లా మార్మోగింది. వేడుకలను పురస్కరించుకుని మందిరాల్లో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

వ్యవసాయం కరువు!

టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో కూటమి సర్కారు ఏర్పడి నెలన్నరవుతున్నా ఇప్పటికీ వ్యవసాయ, అనుబంధ రంగాల వైపు దృష్టి సారించలేదు. రైతులకు ఆర్థిక చేయూతనందించలేదు. గతంలో అన్నదాతల కోసం అమలైన సంక్షేమ పథకాలపైనా ఎలాంటి స్పష్టతా ఇవ్వడం లేదు. ఇదే సమయంలో ప్రకృతి కరుణ కూడా కరువవడంతో అన్నదాతల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

- నెలన్నరవుతున్నా పైసా విదల్చని కూటమి సర్కారు
- వ్యవసాయ, అనుబంధ శాఖల్లో నిర్లిప్తత
- ప్రభుత్వ చేయూత కోసం రైతన్నల ఎదురుచూపు

బుక్కరాయసముద్రం వద్ద సేద్యం పనుల్లో రైతన్న





పొలంలో దిగాలుగా కూర్చున్న రాప్తాడు మండలం హంపాపురం రైతు సింగారప్ప

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున వర్షాధార వ్యవసాయం జరుగుతుంది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో 7 నుంచి 8 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయి. 2.10 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో ఉద్యాన తోటలు విస్తరించాయి. పశుపోషణ, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు అధికంగా ఉన్నారు. మల్బరీ సాగుకు శ్రీ సత్యసాయి జిల్లా పెట్టింది పేరు. ఇక.. సీమ జిల్లాల పరిధిలో 'అనంత'లోనే మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. ఇలా వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో లక్షలాది రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

సాయం కోసం ఎదురుచూపు..

రైతులను ఆదుకోవాల్సిన కూటమి సర్కారు వారి పట్ల చిన్నచూపు చూస్తోంది. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి నెలన్నర కావస్తున్నా అన్నదాతలకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేదు. పంటల బీమాపై ఇంత వరకూ మార్గదర్శకాలే విడుదల చేయలేదు. ఇప్పటికే పంట రుణాల రెన్యూవల్స్ పూర్తయినా, బీమా ప్రీమియం ఎలా చెల్లించాలనే దానిపై స్పష్టత లేదు. ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాలు తగ్గిపోతున్నందున బిందు, తుంపర సేద్య పరికరాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

గత ఐదేళ్లు నిరాటంకంగా..

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఆర్థిక అవసరాలు ఎక్కువగా ఉంటాయి. పంటల సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, యంత్రాల బాడుగలు తదితరాలకు డబ్బు అవసరముంటుంది. ఈ విషయం అర్థం చేసుకున్న గత వైఎస్సార్ సీపీ సర్కారు ఏటా జూన్‌లోనే పథకాల ఫలాలు రైతుల దరిచేర్చింది. రాయితీ విత్తనం, ఎరువులు, రైతు భరోసా–పీఎం కిసాన్ కింద మొదటి విడతగా రూ.7,500 పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా కింద పరిహారం, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్‌సబ్సిడీ, యంత్రసేవ కింద ట్రాక్టర్లు, ఇతర ఆధునిక పరికరాలు అందించేది. అలాగే ఉద్యానశాఖ ద్వారా పండ్లతోటల విస్తరణ, పాత తోటల పునరుద్ధరణ సాయం, బీమా కింద పరిహారం, ఇన్‌పుట్ కింద పెట్టుబడి రాయితీ పంపిణీ చేసేది. పండ్లతోటల రైతులకు అత్యవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్ (బిందు, తుంపర) పరికరాలు కూడా రాయితీపై అందించేవారు. మత్స్యశాఖ ద్వారా జూలైలో చేపపిల్లల పెంపకానికి ప్రోత్సాహకం, పట్టుశాఖ పరిధిలో మల్బరీ సాగు రైతులకు రాయితీలు, పశుశాఖ పరిధిలో పథకాలు నిరాటంకంగా అమలయ్యాయి. అయితే, కూటమి ప్రభుత్వ ఉదాసీనత కారణంగా నేడు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి, పశుసంవర్థక, మత్స్య, మార్కెటింగ్ తదితర శాఖల్లో నిర్లిప్తత ఆవరించింది. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అయోమయంలో అన్నదాతలు



చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి నెలన్నర కావొస్తున్నా, వ్యవసాయ రంగానికి సంబంధించి పథకాలు, రాయితీలు, పరిహారంపై ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. గతేడాది పంటలు దెబ్బతినడం వల్ల ఇప్పటికే రైతులు కష్టాల్లో ఉన్నారు. ఈ క్రమంలో రైతులను ఆదుకోవాల్సిన సర్కారు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. గత ఖరీఫ్, రబీకి సంబంధించి ఉచిత పంటల బీమా పరిహారం ఇవ్వాలి. ఈ ఏడాది బీమా పథకం అమలుపై చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు, ఉద్యాన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలి.

– ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పేద విద్యార్థుల ఉన్నతికి సహకరించండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం టవర్‌క్లాక్: భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా నిరుపేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో చదువుకుని ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆదివారం అనంతపురంలోని నక్కా రామారావు యాదవ భవన్‌లో పూలే, అంబేద్కర్ ప్రతిభాపురస్కారాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గిరిజమ్మ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను గుర్తించి 20 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కులమతాలకు అతీతంగా ప్రతిభాపురస్కారాలను అందజేస్తున్నట్లు మహాత్మా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోతుల నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. ఈ నెల 28 వరకూ సాగనుంది. జాతీయ విద్యా విధానం– 2020 అమలులోకి వచ్చి నాలుగో ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ డీవైఈఓ, ఎంఈఓ, హెచ్ఎంలను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరివర్తనాత్మక సంస్కరణలపై ప్రభుత్వాల నిబద్ధతను తెలియజేయడమే 'శిక్షా సప్తాహ్' ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వాములు కావాలని కోరారు.

- తొలి రోజు ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలి. 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించాలి. 24న విద్యార్థులకు క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేస్తూ క్రీడా దినోత్సవం నిర్వహించాలి. 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. 26న తరగతి గది అనుభవాలను మెరుగు పరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించి విద్యలో సాంకేతికత ఉపయోగించడాన్ని పెంచాలి. 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, పోషణ దినోత్సవ నిర్వహణ. పాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ మాతృమూర్తులతో కలిసి మొక్కలు నాటాలి. 28న విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాలతో సహకారం పెంపొందించాలి. విద్యార్థులను పర్యావరణ వ్యవస్థతో అనుసంధానించేలా వారితోనే కలిసి సహపంక్తి భోజనం చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలి.
- రోజూ కార్యక్రమానికి సంబంధించిన నివేదిక, ఫొటోలను ప్రధానోపాధ్యాయులు ఎంఈఓలకు పంపాలని డీఈఓ వరలక్ష్మీ ఆదేశించారు. ఎంఈఓలు నివేదికలను సమగ్రశిక్ష కార్యాలయానికి పంపాలని సూచించారు.

ప్రేమమూర్తికి గురువందనం



సత్యసాయి మహాసమాధి



భక్తిగీతాలు ఆలపిస్తున్న సత్యసాయి ప్రశాంతి భజన బృందం

- ప్రశాంతి నిలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక గురువైన సత్యసాయికి అశేష భక్త జనం గురువందనం సమర్పించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత గురుపౌర్ణమి వేడుకలు విద్యార్థుల వేదపఠనంతో ప్రారంభమయ్యాయి. ప్రేమమూర్తి సత్యసాయికి ప్రశాంతి భజన బృందం చక్కటి భక్తిగీతాలతో గురువందనం సమర్పించింది. వేలాదిమంది భక్తులు ఒక్కటై సాయి నామాన్ని స్మరించగా పుట్టపర్తి పులకించిపోయింది. ముఖ్య అతిథిగా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరై సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి అవతార వైభవం, అవతార ప్రకటన, సత్యసాయి బాబా గురుతత్వాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య భక్తులకు వివరించారు. సత్యసాయి ట్రస్ట్ సేవలను కొనసాగిస్తున్న తీరును, సత్యసాయి ఆశయాలను చక్కగా వివరించారు. వేడుకలలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు రిహికో హిరా, డాక్టర్ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌కు శాంతిభవన్ అతిథి గృహం వద్ద గౌరవ వందనం తర్వాత అధికారులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, ఏఎస్పీ విష్ణు, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ..

గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రముఖ సంగీత విద్వాంసులు రంజని, గాయత్రిల బృందం నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తి గీతాలతో సంగీత కచేరీ సాగింది.



గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

'నిండు'గా ఆశీర్వాదం

కళకళలాడుతున్న టీబీ డ్యాం



జిల్లావైపు తుంగభద్రమ్మ బిరబిరా పరుగులు పెట్టనుంది. రైతులకు ఆనందం పంచనుంది. పంట పొలాలను సస్యశ్యామలం చేయనుంది. టీబీ డ్యాం నుంచి సోమవారం హెచ్చెల్సీకి నీరు విడుదల కానున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక.. హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి 1,24,538 క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 78.239 టీఎంసీల నీరు నిల్వ ఉంది. – బొమ్మనహళ్:

కరుణించని మేఘం

అనంతపురం సమీపంలో ఈదురు గాలులకు కదిలిపోతున్న మేఘాలు



వర్షం పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ విభాగం చెబుతోంది. అందుకు అనుగుణంగానే రోజూ మేఘాలు ఊరిస్తున్నాయి. కానీ వర్షం మాత్రం కురవడం లేదు. గాలులకు మేఘాలు పలాయనం చిత్తగిస్తున్నాయి. నెల రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా ఇదే పరిస్థితి. కొన్ని చోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు మినహా ఎక్కడా పట్టుమని 10 మి.మీ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో అన్నదాత పరిస్థితి దయనీయంగా మారింది. – అనంతపురం అగ్రికల్చర్:

ఆగని అధికార దాహం



ఇసుకాసురులు మారడం లేదు. అధికారమే అండగా చెలరేగిపోతున్నారు. పోలీసులు చర్యలు తీసుకుంటున్నా, డోంట్ కేర్ అంటున్నారు. తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. శింగనమల మండలంలో పెన్నానది, కూతలేరు వంక, శింగనమల చెరువు వంక నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. పగలు ఓ చోట డంప్ చేసి రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా వేరే ప్రాంతాలకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అలా ఇసుకాసురులు శింగనమల మండలం సోదనపల్లి వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్ ఇది. – శింగనమల:

క్లుప్తంగా

కసాపురంలో ఘనంగా గురుపౌర్ణమి


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ యాగశాలలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పంచ సూక్త, మన్యుసూక్త, మూలమంత్ర హోమాన్ని నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ ఎస్‌ఈగా సంపత్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న ఆయనకు ఎస్‌ఈగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ సీఎండీ సంతోష్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు ఏఈగా, ఏడీగా, డీఈగా సంపత్‌కుమార్ పనిచేశారు. శనివారం ఉదయం విద్యుత్ శాఖ ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టాలనుకున్నారు. అయితే అనివార్య కారణాల వల్ల ఆదివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

తైక్వాండో చాంపియన్ సోహన్విక


సోహన్విక

అనంతపురం: సౌత్ జోన్ తైక్వాండో చాంపియన్ షిప్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన సోహన్విక సొంతం చేసుకుంది. ఈ పోటీలు బెంగళూరులో ఆదివారం నిర్వహించారు. అండర్–9 విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన ఎం.గుణరంజన్‌రెడ్డి కుమార్తె ఎం.సోహన్విక బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. చాంపియన్‌గా నిలిచిన సోహన్వికను పలువురు అభినందించారు.

అరుదైన పంటలు.. అద్భుత లాభాలు



- కరువు నేలపై సిరుల పంట
- ఖర్జూర, డ్రాగన్ ఫ్రూట్ పంటల సాగుతో ఆదర్శంగా నిలిచిన రైతు రమణారెడ్డి

గార్లదిన్నె: ప్రయోగాలకు ఎప్పుడూ ముందుండే ఉమ్మడి అనంత జిల్లా రైతులు అరుదైన ఉష్ణ మండల దేశాల పండ్ల తోటల సాగుతో లాభాలు గడిస్తున్నారు. ఒక్కసారి మొక్క నాటితే ఏళ్ల తరబడి లాభాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూర సాగుతో ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌కు చెందిన రైతు రమణారెడ్డి ఒకరు.

పట్టువదలకుండా...

గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లో తన కున్న భూముల్లో రైతు రమణారెడ్డి డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూర పంటల సాగు చేపట్టారు. 2016లో యూట్యూబ్ చానల్‌లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు పరిశీలించిన ఆయన మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి లోకల్ అంట్లు తీసుకువచ్చి నాటాడు. తొలి పంట చేతికి అందలేదు. పంట పూర్తిగా నష్టపోయాడు. అయినా ఆయన పట్టువిడవకుండా కరోనా సమయంలో థాయిలాండ్ నుంచి జైన్ రకం ఒక్కొక్క కొమ్మకు రూ.250లు వెచ్చించి దాదాపు 6 వేల కొమ్మలు కొనుగోలు చేసి తెప్పించాడు. మూడు నెలల పాటు నర్సరీలో కొమ్మలు పెంచిన అనంతరం తన భూమిలో నాటాడు. ప్రతి మొక్కకూ ఓ స్తంభాన్ని నాటి, దానిపై రింగ్ ఏర్పాటు చేశాడు. ఎకరాకు 2 వేల కొమ్మలు చొప్పున మర్తాడులో 3 ఎకరాలు, కోటంకలో 3 ఎకరాల్లో నాటిన మొక్కలు ప్రస్తుతం విరగ్గాసాయి. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ పంట మూడు టన్నుల మేర కోత కోసి, మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక్కసారి మొక్క నాటితే దాదాపు 30 నుంచి 40 సంవత్సరాల పాటు దిగుబడి పొందవచ్చునని రైతు తెలిపారు.


సాగు చేసిన ఖర్జూరం పంట (ఇన్‌సెట్) దిగుబడులు కోస్తున్న రైతు రమణారెడ్డి

పంట పెట్టుబడి అధికమైనా...

సాధారణంగా డ్రాగన్ ఫ్రూట్ పంట తక్కువ నీటితో పండుతుంది. ఒక ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు దాదాపు రూ. 5లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ పెట్టుబడులు వస్తాయి. నూతన సాంకేతికత విధానాలతో పాటు సరైన యాజమాన్యం పాటిస్తే రూ.4 లక్షల అదనపు ఖర్చు వస్తుంది. ఎడారి మొక్క కావడంతో కాయ దశలో మాత్రమే పురుగు ఆశించే అవకాశం ఉంది. ఏడాదిలో మూడు సార్లు పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో ఒక గంట పాటు నీటి తడులు ఇస్తే చాలు. హైబ్రీడ్ రకం కావడంతో పంట సాగు చేసిన 8 నెలల్లో కోత దశకు వస్తుంది. జూన్ నుంచి డిసెంబర్ వరకూ పంట కోతలు ఉంటాయి. ఎంత లేదన్నా.. ఎకరాకు పది టన్నుల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.20 లక్షల ధర పలుకుతోంది. జిల్లాలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో పంట దిగుబడులను చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. నాణ్యమైన పంట ఉత్పత్తులున్నాయంటే ఆ ప్రాంత వ్యాపారులు నేరుగా తోట వద్దకే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారని రైతు వివరించారు.

రోజూ ఆదాయమే...

ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ కిలో రూ.150 నుంచి రూ.200తో అమ్ముడు పోతోంది. దీంతో చాలా మంది చిరువ్యాపారులు నేరుగా రోజూ రైతు రమణారెడ్డి తోట వద్దకెళ్లి కిలో రూ.120 చొప్పున హోల్‌సేల్ ధరతో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు రోజూ ఆదాయం ఉంటోంది. అలాగే డ్రాగన్‌ఫ్రూట్ అంటు కూడా రూ.50తో విక్రయిస్తుండడంతో చాలా మంది రైతులు పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు మూడు ఎకరాల్లో రైతు రమణారెడ్డి ఖర్జూర పంట సాగునూ చేపట్టారు. అబూదాబీ నుంచి ఒక్కొక్క మొక్కను రూ.4,500 చొప్పున 500 ఆడ, 50 మగ మొక్కలు కొనుగోలు చేసి, పంట సాగు చేపట్టారు. ఖర్జూర సాగుకు మొక్క కొనుగోలు సమయంలో అయ్యే ఖర్చు తప్ప సాగు సమయంలో ఎలాంటి పెట్టుబడులూ అవసరం లేదని రైతు తెలిపారు. నీటి తడులు కూడా చాలా తక్కువగా ఉంటాయన్నారు. ఎకరా విస్తీర్ణంలో 100 చెట్లు సాగు చేయవచ్చునన్నారు. ఐదేళ్లలో ఒక్కో చెట్టు వంద కిలోల దిగుబడి ఇస్తుందని, ఎకరా విస్తీర్ణంలో పది టన్నుల దిగుబడి చేతికి వస్తుందన్నారు. నాణ్యత, రకాన్ని బట్టి కిలో రూ.200 నుంచి రూ.250 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. తోట వద్దనే అయితే కిలో రూ.120 చొప్పున హోల్‌సేల్ ధరతో విక్రయిస్తున్నానన్నారు.


డ్రాగన్ ఫ్రూట్‌ను కోస్తున్న దృశ్యం

తోటల్లో సస్యరక్షణ చేపట్టండి

అనంతపురం అగ్రికల్చర్: ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నందున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యాన తోటలకు ఆశించిన చీడపీడలు, తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఉద్యానశాఖ శ్రీసత్యసాయి జిల్లా అధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 22 నుంచి 24 డిగ్రీలు, గాలివేగం గంటకు 25 నుంచి 30 కిలోమీటర్లు, 39 శాతం వర్ష సూచన లాంటి భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నందున పండ్లు, కూరగాయల రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఉద్యాన తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

- దానిమ్మ తోటల్లో ఆశించిన ఆంత్రాక్నోస్ ఆకు, కాయ మచ్చ తెగులు నివారణకు లీటర్ నీటికి 1 గ్రాము కార్బండిజమ్ + 5 గ్రాముల ఎం–45 కలిపి పిచికారీ చేయాలి. అలాగే బ్యాక్టీరియా మచ్చ తెగులు నివారణకు లీటర్ నీటికి 3 మి.లీ సూడోమోనాస్ కలిపి పిచికారీ చేయాలి.
- చీనీ తోటల్లో ఆశించిన గజ్జి తెగులు నివారణకు లీటర్ నీటికి 1 గ్రాము కాపర్ హైడ్రాక్సైడ్ + 0.3 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారీ చేయాలి.
- మామిడి తోటల్లో ప్రస్తుతం జాగ్రత్తగా కత్తిరింపులు చేసుకోవాలి. కత్తిరింపులు చేసిన వెంటనే లీటర్ నీటికి 2.5 గ్రాములు సీవోసీ + 2.5 మి.లీ క్లోరిపైరిపాస్ కలిపి పిచికారీ చేయాలి.
- టమాట ధరలు బాగున్నందున దిగుబడులు పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో తోటల్లో అక్కడక్కడ ఆశించిన ఊజీ (పిన్‌వార్మ్) నివారణకు లీటర్ నీటికి 0.3 మి.లీ ట్రేసర్ కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఆకు మచ్చ, కాండం మచ్చ తెగుళ్ల నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ అజాక్సిస్ట్రోబీన్ కలిపి పిచికారీ చేయాలి.


టమాటను ఆశించిన ఆకుమచ్చ తెగులు

'దుర్గం' రెవెన్యూ కార్యాలయాలపై 'ఏసీబీ' కన్ను

- అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైలు పరుగెత్తాయి. ఏసీబీ అధికారులు వచ్చి వెళ్లేంత వరకూ ఈ విషయం బయటకు పొక్కకుండా అధికారులు అత్యంత గోప్యత పాటించడం గమనార్హం. కాగా, కొన్నేళ్లుగా కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ డిప్యూటీ తహసీల్దార్, పలువురు వీఆర్వోలు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అన్నదమ్ములకు సంబంధించిన భూ సమస్యలలో తలదూర్చి అధికంగా ముడుపులు దండుకుని ఓ వర్గానికి మాత్రమే భూ హక్కులు ఉండేలా అనుమతులు ఇచ్చారనే విమర్శలూ ఉన్నాయి. అధికారులు చేస్తున్న అవినీతి అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోవడంతో విసుగు చెందిన కొందరు బాధితులు ఏకంగా ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఇటీవల కళ్యాణదుర్గానికి వచ్చిన ఏసీబీ అధికారులు ఎవరికీ అనుమానం రాకుండా అరగంట పాటు తహసీల్దార్ కార్యాలయం, వీఆర్వోల గది (చావిడి)తో పాటు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అధికారుల పనితీరును గమనించారు. భూ సమస్యలపై ఆయా కార్యాలయాలకు వచ్చిన పలువురు రైతులతో సాధారణ పౌరుల్లాగా వ్యవహరిస్తూ వివరాలు ఆరా తీశారు. అయితే ఏసీబీ అధికారులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన ఓ డిప్యూటీ తహసీల్దార్ వెంటనే వీఆర్వోలను అప్రమత్తం చేసి కార్యాలయాన్ని ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లాలని సూచించినట్లు సమాచారం. గత కొన్నేళ్లలో భూ సమస్యలను ఆసరాగా తీసుకుని అడ్డగోలుగా అనుమతులు ఇస్తూ అవినీతికి పాల్పడిన ఆర్డీఓ కార్యాలయ అధికారి, ఓ డీటీ, ఇద్దరు వీఆర్వోలపై విచారణ చేసినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం.


కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయం

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు


రాతి దూలం లాగుతున్న వృషభాలు

గార్లదిన్నె: గురుపౌర్ణమి సందర్భంగా గార్లదిన్నెలో ఆదివారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 జతల వృషభాలను పోటీలకు రైతులు తీసుకువచ్చారు. గార్లదిన్నెకు చెందిన రైతు రామాంజనేయులు వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. అలాగే రెండో స్థానాన్ని నంద్యాల జిల్లాకు చెందిన రైతు పవన్‌కుమార్ వృషభాలు, మూడో స్థానాన్ని గార్లదిన్నెకు చెందిన రమేష్ వృషభాలు, నాల్గో స్థానాన్ని తోపుదుర్తి రైతు చెన్నప్ప వృషభాలు, ఐదో స్థానాన్ని అనంతపురానికి చెందిన ఓబుళపతి వృషభాలు దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు ఆదినారాయణ, విశాలాక్షి, గేట్ కృష్ణారెడ్డి, బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ప్రేమికుడి మృతి

బొమ్మనహాళ్: ప్రేమించిన అమ్మాయి పెళ్లికి కాదనడంతో ఆత్మహత్యా యత్నం చేసిన మనోజ్‌రెడ్డి (26) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు.. శెట్టూరు మండలానికి చెందిన మనోజ్‌రెడ్డి బొమ్మనహాళ్ మండలం దేవగిరి గ్రామానికి చెందిన ఓ యువతిని కొంత కాలంగా ప్రేమించాడు. ఈ క్రమంలో శనివారం దేవగిరి గ్రామానికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని ఆమెను బతిమలాడాడు. అయితే అప్పటికే తనకు మరొకరితో పెళ్లి నిశ్చయమైందని ఆమె తెలపడంతో మనస్తాపం చెందిన మనోజ్‌రెడ్డి క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆయన మృతి చెందాడు. మృతుడి తండ్రి వన్నూర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

తాడిపత్రి రూరల్: స్థానిక రూరల్ పోలీసులను ఆదివారం ఓ ప్రేమజంట ఆశ్రయించింది. వివరాలు... సజ్జలదిన్నెకు చెందిన ప్రసాద్, బ్రాహ్మణపల్లికి చెందిన షమీరా... తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పుట్లూరు మండలం ఎ.కొండాపురం శివారున ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో వారిద్దరూ పెళ్లి చేసుకుని నేరుగా తాడిపత్రి రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చి తల్లిదండ్రుల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆశ్రయించారు. విచారణ అనంతరం వారి తల్లిదండ్రులకు సీఐ లక్ష్మీకాంతరెడ్డి సమాచారం అందించారు.

బ్రాహ్మణ యువత ఆలోచనల్లో మార్పు రావాలి


వధూవర పరిచయ వేదిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

- ఎఫ్‌ఓబీ ఆఫ్ ఇండియా చైర్మన్ చిత్రపు రామకృష్ణ శేషగిరిరావు

అనంతపురం కల్చరల్: ఆధునిక కాలానికి అనుగుణంగా బ్రాహ్మణ యువత, తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు రావాలని ఎఫ్‌వోబీ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ చిత్రపు రామకృష్ణ శేషగిరిరావు అన్నారు. ఆదివారం అనంతపురం ఆర్‌ఎఫ్‌రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 5వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవర పరిచయ వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందల సంఖ్యలో వధూవరులు, తల్లిదండ్రులు వివాహ సంబంధాలను జాతకాల ఆధారంగా కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సాగిన సమావేశానికి వేదపండితులు ఏఎల్‌ఎన్‌శాస్త్రి అధ్యక్షత వహించారు. అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం జాతీయ చైర్మన్ శేషగిరిరావుతో పాటూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాక్షాయిని, వేదపండితులు సంకేపల్లి సత్యనారాయణ, నార్పల మారుతీనరసింహం, కరణం చంద్రకాంతరావు, పోనుగంటి మురళీ, కిరణ్, బత్తలపల్లి సత్యరంగారావు తదితరులు ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. హైందవ జాతి సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతున్న బ్రాహ్మణులను ఆలయ కమిటీల చైర్మన్లుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇతర వర్గాల వారితో పోల్చితే బ్రాహ్మణ యువకులకు ముఖ్యంగా అర్చక,పురోహిత వృత్తిలో ఉన్న వారికి సంబంధాలు కష్టతరంగా మారుతున్నాయన్నారు. శాఖాభేదాలు మాని ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పలువురు రాష్ట్ర నాయకులు అన్నారు. అనంతరం పలు విభాగాల వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా విభాగం నేతలు లక్ష్మీనరసమ్మ, నీరజ, దుర్గ, నాగజ్యోతి, బాలసుబ్రమణ్యం, వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.



'అ'పూర్వ' సమ్మేళనం

అనంతపురం ఎడ్యుకేషన్: వారంతా 1963 నుంచి 1968 వరకూ అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదివారు. దాదాపు 60 సంవత్సరాల అనంతరం అందుబాటులో ఉన్న వారందరూ ఆదివారం ఆర్ట్స్ కళాశాల వేదికగా కలుసుకున్నారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగ విరమణ పొందిన వారే కావడం గమనార్హం. తమ బ్యాచ్‌మేట్స్‌ను చూసి ఒకరికొకరు మురిసిపోయారు. ఆలింగనం చేసుకుని ఆనందభాష్పాలు రాల్చారు. డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత ఎవరెవరు ఏయే రంగాల్లో స్థిరపడ్డారో, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకుని సరదాగా గడిపారు.

నీలారెడ్డిపల్లిలో చోరీ

బుక్కరాయసముద్రం: మండలంలోని నీలారెడ్డిపల్లిలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌రెడ్డి గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన దుండగులు శుక్రవారం రాత్రి తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని రూ.1.49 లక్షలతో పాటు, బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఇంటి తాళాలు బద్ధలుగొట్టిన విషయాన్ని శనివారం గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు రమేష్‌రెడ్డి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య


భరత్ మృతదేహం

పామిడి: జీవితంపై విరక్తితో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి రెండో కుమారుడు భరత్ (15) పామిడిలోని ఓ ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇంటిపట్టునే ఉన్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ పొలానికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న భరత్... ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపించారు. ఘటనపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, భరత్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

జూలాకాల్వలో ఇరువర్గాల ఘర్షణ


గాయపడిన దాదు

శింగనమల: మొహర్రం సందర్భంగా చెలరేగిన ఘర్షణ రెండు గ్రామాల మధ్య వివాదానికి కారణమైంది. మూడు రోజుల క్రితం శింగనమల మండలం జూలాకాల్వలో జరిగిన మొహర్రం వేడుకల్లో శింగనమలకు చెందిన కొందరు యువకులు పాల్గొన్నారు. ఆ సమయంలో స్థానికులతో గొడవపడడంతో అక్కడి వారు కొట్టి పంపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న బాధిత యువకులు మరుసటి రోజు జూలాకాల్వకు చెందిన ఓ యువకుడు గార్లదిన్నెకు చీనీ కాయల కోతకు బొలెరోలో వెళుతుంటే శింగనమల క్రాస్‌లోని మరువ కొమ్మ వద్ద అడ్డుకుని కొట్టారు. అదే రోజు దాడికి కారకులైన యువకుల బంధువులు కొందరు జూలాకాల్వలో కనిపించడంతో ఆ గ్రామస్తులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న శింగనమల యువకులు కొందరు శనివారం రాత్రి జూలాకాల్వకు చేరుకుని ఘర్షణ పడ్డారు. పరస్పర దాడుల్లో శింగనమలకు చెందిన వారిలో ముగ్గురు, జూలాకాల్వకు చెందిన నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో శింగనమలకు చెందిన నరసింహులు, నందకిశోర్, దాదు, జూలాకాల్వకు చెందిన రంగన్న, నాగచంద్రయ్య, నాగేంద్ర, కిరణ్ ఉన్నారు. క్షతగాత్రులను వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నరసింహులును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆదివారం జూలకాల్వలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఇకపై ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు.

విద్యార్థిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం అర్బన్: ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన ఓ విద్యార్థిపై పోక్సో నమోదైంది. వివరాలను సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ధర్మవరంలోని ప్రియాంకనగర్‌కు చెందిన ఓ బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏడాది క్రితం గీతానగర్‌కు చెందిన ఐటీఐ విద్యార్థి శెట్టి గణేష్ పరిచయమయ్యాడు. ఈ నెల 18న స్కూల్‌కు వెళ్లిన బాలికను బలవంతంగా ఆటో ఎక్కించుకుని ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని అక్కడి నుంచి అనంతపురానికి బస్సులో పిలుచుకెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లారు. 19న తిరిగి పావగడకు బస్సులో చేరుకుని రాత్రి అక్కడే అన్నాచెల్లెలుగా పేర్కొంటూ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు.20న ఉదయం పావగడ నుంచి పెనుకొండకు వచ్చి అమ్మాయిని ధర్మవరం వెళ్లే బస్సు ఎక్కించి అక్కడి నుంచి జారుకున్నాడు. ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. అప్పటికే ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు తాజాగా బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు శెట్టి గణేష్‌పై పోక్సో చట్టంతో పాటు నూతన చట్టం బీఎన్ఎస్ 67, 87 కింద కేసు నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం యర్రగుంట జంక్షన్ వద్ద నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

8 నుంచి శ్రావణమాస ఉత్సవాలు



ఉత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆగస్టు 8వ తేదీ నుంచి శ్రావణమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. ఆదివారం శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8వ తేదీన నాగులచవితి, సర్పసూక్త క్షీరాభిషేకం, 9వ తేదీన నాగ పంచమి సర్పసూక్త క్షీరాభిషేకం, 10వ తేదీన షష్టి మహోత్సవం, కల్యాణోత్సవం, 11వ తేదీన అష్టోత్తర శతకళశాభిషేకం, 18న భక్తి గీతాల ఆలాపన, 25వ తేదీన అన్నాభిషేకం, సెప్టెంబర్ 1వ తేదీన శతసర్పసూక్త హరిద్రాభిషేకం అశ్లేషాబలి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి



పేరూరులో జలధికి తరలుతున్న పీర్లు

రామగిరి: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని పేరూరు, శేషంపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడిలో కొలువైన పీర్ల స్వాములను ప్రత్యేకంగా ముస్తాబు చేసి అలంకరించారు. రాత్రి జరిగిన పెద్ద సరిగెత్తులో భాగంగా ఆయా గ్రామాల్లోని అగ్ని గుండాల చుట్టూ పీర్లను ఊరేగించారు. ఆదివారం సాయంత్రం పీర్ల స్వాములను అగ్ని గుండ ప్రవేశం చేయించారు. అనంతరం జలధికి తరలించారు. పీర్లను దర్శించుకునేందుకు పేరూరు ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కార్తికేయుడికి విశేష పూజలు



అలంకరణలో కార్తికేయుడు



పూజలందుకున్న మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు చేశారు. తొలుత స్వామికి ఆకుపూజ అనంతరం ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి అభిషేకాలు చేపట్టారు. విశేష పూజల అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదానం చేశారు.

కడవకల్లులో గర్భకోశ చికిత్స శిబిరం



పాడి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లులో ఆదివారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ భవిష్యత్తులో 90 శాతం కచ్చితత్వంతో పేయి దూడల పుట్టుక ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకంపై అవగాహన కల్పించారు. రూ.1,350 విలువ చేసే రెండు సూదులను రూ.850 సబ్సిడీతో రూ.500కు పెయ్య దూడలను పొందే ఇంజక్షన్లను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రెండు ఇంజక్షన్లు వేసినా ఫలితం లేకపోతే రూ.500 రైతులకు వెనక్కు ఇస్తామన్నారు. ఈ ఇంజక్షన్ల వల్ల కుర్ర దూడ పుడితే రూ.250 తిరిగి చెల్లిస్తారన్నారు. కృత్రిమ గర్భధారణ విదేశీ జాతులనే కాకుండా స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్, తార్పర్కార్ వంటి బ్రీడ్‌లను రైతులు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగసువర్ణ, రైతులు పాల్గొన్నారు.

మార్మోగిన సాయినామం

- ఘనంగా గురుపౌర్ణమి



మారుతీనగర్‌లో పూజలందుకున్న సాయినాథుడు

అనంతపురం కల్చరల్: వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. లోకానికి జ్ఞానమూర్తిగా పూజలందుకుంటున్న సాయినాథుడి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. ఆదివారం కలిసి రావడంతో నగరంలోని ప్రధాన బాబా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. 'ఓం సాయి శ్రీసాయి' నామ స్మరణతో మందిరాలు ప్రతిధ్వనించాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ విశేష పూజలు జరిగాయి. తపోవనంలోని శివశక్తి బాబా మందిరం, ఆదిమూర్తి నగర్ వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా, మూడవ రోడ్డు, వేణుగోపాల నగర్, ఐదవ రోడ్డు, రామచంద్రా నగర్, చెరువుకట్టపై వెలసిన షిర్డీ సాయిబాబా మందిరాల్లో బాబా దర్శనానికి బారులుదీరారు. పలు చోట్ల పల్లకీ సేవలు, గ్రామోత్సవాలు, బాబాకు చందన సేవలు నేత్రపర్వంగా సాగాయి. వేలాది మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మారుతీ నగర్‌లోని రామాలయంలో పెద్ద ఎత్తున షిర్డీ సాయికి పల్లకీ ఉత్సవం, సాయి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కోవూరు నగర్‌లోని స్వామి దయానంద సేవా ఆశ్రమంలో స్వామి సత్యాత్మనంద ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. డాక్టర్ నిర్మల మురళీ విశిష్ట అతిథిగా హాజరై గురుపౌర్ణమి విశిష్టతను వివరించారు. శారదా నగర్ శృంగేరీ శారదా శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమం, కమలానగర్‌లోని సద్గురు రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమం తదితర చోట్ల గురుపౌర్ణమి సందడి నెలకొంది.

ఓంనగర్‌లో..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డు ఓంనగర్‌లో వెలిసిన షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ముందురోజు శనివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ సాయినామ సంకీర్తన, గాన కచేరీ నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విశేష పూజలు చేపట్టారు. ఎస్టేట్, ఆంజనేయస్వామి నగర్, పాపంపేట, సిండికేట్ నగర్, విద్యారణ్య నగర్, గణేష్ నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి దాకా అన్నదానం కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.నారాయణరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ ఎ.ఉమామహేశ్వర రావు, సభ్యులు నీలకంఠారెడ్డి, చంద్రమౌళేశ్వర రెడ్డి, రాము, నరసింహారెడ్డి, జితేంద్ర, రంగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సద్గురువుల శోభాయాత్ర..

అనంతపురం కల్చరల్: ఆషాడశుద్ధ పౌర్ణమి సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యుల శోభాయాత్ర ఆదివారం కన్నుల పండువగా సాగింది. ఉదయం స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం నుంచి సాగిన నగరోత్సంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అంతరాష్ట్రీయ హిందూ పరిషత్, ఆలయ అనువంశీక ధర్మకర్త హోసూరు రామసుబ్రహ్మణ్యం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నగరోత్సవంలో హిందూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామసుందర్, మఠం ఆనంద్ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి సద్గురువుల విశిష్టత గురించి మాట్లాడారు. శోభాయాత్ర ముందు నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య శిష్యబృందాలు కోలాటం ప్రదర్శించారు. భక్తిగీతాలపనలతో ఆదిశంకరులకు నీరాజనాలర్పించారు. అదేవిధంగా యోగదా సత్సంగ మండలి ఆధ్వర్యంలో జగద్గురు యోగానంద చిత్రపటంతో ఆదిమూర్తినగర్‌లోని ధ్యాన మండలి నుంచి భజనలు చేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ చంద్రశేఖర్, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై వెలసిన బాబా దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



ఆత్మకూరు: గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత

అనంతపురం కల్చరల్: భక్తిభావంతో మానసిక ప్రశాంతత స్థిరమైన ఆలోచనలు సాధ్యమని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. కోవూరు నగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువు పదానికి నిజమైన అర్థం తెలిపిన ఎందరో మహనీయులు షిర్డీ సాయినాథుడు ఒకరన్నారు. కులమతాలకు అతీతంగా పూజలందుకుంటూ సమాజంలో అందరూ ఒకటేనన్న భావనను వ్యాప్తి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యూనివర్సిటీ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు, అన్నదాన సేవలు, సామూహిక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు ఏపీ రమణ, వీరారెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వివేకానంద యోగ కేంద్రంలో నగరంలోని తొమ్మిది చోట్ల ఉచితంగా యోగా నేర్పుతున్న గురువులను సత్కరించారు. యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి నేతృత్వంలో గురుపౌర్ణమి వేడుకలు, సత్కారాలు జరిగాయి.

రాప్తాడు: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా దేవాలయాల్లో ఆదివారం వేద పండితుడు వాసుదేవ రావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి అభిషేకాలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పార్వతి ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. అనంతరం ఆయా ఆలయాల్లో ప్రసాదాలు పంచి పెట్టారు.

మౌనగిరి క్షేత్రంలో భక్తుల సందడి

మండలంలోని హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రంలో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామికి ఆలయ వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

భక్తులకు అన్నదానం..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో బాబా మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అన్నదానం చేశారు.



తపోవనంలో శివశక్తి సాయిబాబాకు పూజలు



దయానంద ఆశ్రమంలో గురుపూజోత్సవం



నగర వీధుల్లో జగద్గురు శంకరాచార్యుల శోభాయాత్ర



ఐదవ రోడ్డులో..



సాయిబాబా దర్శనానికి వచ్చిన భక్తులు



ప్రసాదం స్వీకరిస్తున్న మేయర్ వసీం



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



బాబాను దర్శించుకుంటున్న మహిళలు



రాప్తాడు: పూజలందుకుంటున్న షిర్డీ సాయిబాబా

నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మూర్తి

- నేడు రిలీవ్ కానున్న కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న మేఘ స్వరూప్ సోమవారం రిలీవ్ కానున్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ మదనపల్లి సబ్ కలెక్టర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. నగరపాలక సంస్థ కమిషనర్‌గా కేవలం ఆరు నెలలు మాత్రమే ఆయన విధులు నిర్వర్తించారు. ఈ ఏడాదిలో కొన్ని నెలల పాటు ఎన్నికల విధుల్లోనే ఎక్కువగా పని చేయాల్సి వచ్చింది. కానీ పారిశుధ్యం మెరుగులో కమిషనర్ ప్రత్యేక చొరవ చూపారు. కార్మికులు సమయపాలన పాటించడంతో పాటు క్రమం తప్పకుండా విధుల్లో పాల్గొని చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించారు. నూతన కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి వస్తారా లేదానని చూడాల్సి ఉంది. నూతన కమిషనర్ నియామకం మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి.



పీవీవీఎస్ మూర్తి, ఇన్‌చార్జ్ కమిషనర్

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పీవీవీఎస్ మూర్తి

నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మునిసిపల్ ఆర్‌డీగా ఉన్న పీవీవీఎస్ మూర్తి వ్యవహరించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

'ఆమె'దే అజమాయిషీ

- టౌన్ ప్లానింగ్‌లో చక్రం తిప్పుతున్న ఓ మహిళా ఉద్యోగిని
- పట్టణ ప్రణాళిక కార్యదర్శులతో బృందంగా ఏర్పడి అక్రమ నిర్మాణాలపై డీలింగ్స్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి దిక్కే లేకుండా పోయింది. గత కొన్ని సంవత్సరాలుగా టౌన్ ప్లానింగ్ విభాగం కేవలం ముగ్గురు అధికారులతో నడుస్తోంది. దీంతో నగరంలో అనధికార నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కేవలం ఓ కింది స్థాయి మహిళా అధికారిణి పెత్తనంతోనే టౌన్ ప్లానింగ్ విభాగం నడుస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విధుల్లో ముగ్గురే..

నగరపాలక సంస్థలో పరిధిలో 74,964 హౌస్‌హోల్డ్స్ ఉన్నాయి. 50 డివిజన్లలో 28 రెవెన్యూ వార్డులు ఉన్నాయి. 3,47,000 మంది ఓటర్లు ఉన్నారు. లక్షకు పైగా భవనాలు, నిర్మాణాలు ఉన్నాయి. నగరంలో ట్రాఫిక్‌ది ప్రధాన సమస్య. అక్రమ, అనధికారి నిర్మాణాలు, ఆక్రమణలు, నగరపాలక సంస్థ ఆస్తులు తదితర వాటిని పరిరక్షించడంలో టౌన్‌ప్లానింగ్ విభాగం కీలకం. దీంతో పాటుగా నగరంలో ఇబ్బడి ముబ్బడిగా అనధికార నిర్మాణాలు వెలిశాయి. ప్రస్తుతం వందకుపైగా నిర్మాణాలు జరుగుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు 200లకు పైగా నిర్మాణదారులు భవనాల అతిక్రమణ చేశారని చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రధానంగా నగరపాలక సంస్థకు చెందిన రూ.వందల కోట్ల స్థలాలపై పర్యవేక్షణ కరువైంది. వేణుగోపాల్ నగర్‌లోని సెంట్రల్ పార్క్‌లో నగరపాలక సంస్థ ఆస్తుల పరిరక్షణలోనూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

కోర్టు కేసులు కోకొల్లలు

చార్జ్‌షీట్లతో పాటు ఆక్రమణలు, తదితర వాటికి సంబంధించి వందల సంఖ్యలో కోర్టు కేసులున్నాయి. వీటికి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులే వివరణ, కౌంటర్ ఇవ్వాల్సి ఉంటుంది. వాస్తవంగా నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురు ఏసీపీలు, ఒక టీపీఓ, ముగ్గురు టీపీఎస్‌లు, ఆరు మంది టీపీబీఓలుండాలి. కానీ ఇక్కడ ఏసీపీ, టీపీఓ, టీపీబీఓ మాత్రమే ఉన్నారు. దీంతో పాలన మరింత కఠినతరమవుతోంది. 74 సచివాలయాల పరిధిలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులున్నా.. వారు నోటీసులివ్వడానికి వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది.



అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

అన్నీ ఆమె చూసుకుంటారు..

ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురు అధికారులున్నా.. అందులో ఓ మహిళా అధికారిదే పెత్తనం. నిర్మాణాలపై చర్యలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలన్నా.. సదరు మహిళా అధికారే అన్నీ చూసుకునే పరిస్థితి. ఏదైనా స్థల వివాదం ఉన్నా.. సంబంధిత నిర్మాణదారులు ఉన్నతాధికారులను సంప్రదించరు. నగరపాలక సంస్థలోని పై భాగంలో ఉన్న ఆ అధికారితోనే సంప్రదింపులు జరుపుతుంటారు. డీల్ కుదిరిన భవనాల జోలికి వెళ్లకపోవడం, డీల్ కుదిరితే చార్జ్‌షీట్లు వేసుకుంటామని సదరు అధికారే నిర్మాణదారులకు భరోసా ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మహిళా అధికారి కొందరు పట్టణ ప్రణాళిక కార్యదర్శులను బృందంగా ఏర్పాటు చేసుకుని చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ మంది సిబ్బంది ఉండటంతోనే ఆ మహిళా అధికారిదే చెలామణి అవుతోంది. పూర్తి స్థాయిలో సిబ్బంది ఏర్పాటు జరిగితే నగరాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

చికిత్స పొందుతూ సీసీ మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైకేపీ సీసీ ఆనంద్ కుమార్ (35) మృతి చెందారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన మృతుడు ఆనంద్ కుమార్ చెన్నేకొత్తపల్లి మండలంలో వెలుగు సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అనంతపురము నుంచి చెన్నేకొత్తపల్లికి ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా.. బస్సులో నుంచి జారి పడటంతో తీవ్రంగా గాయపడిన విషయం తెల్సిందే. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆనంద్‌కుమార్‌ను రాత్రి అనంతపురం తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆనంద్‌కుమార్ స్వగ్రామం మామిళ్లపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన అంత్యక్రియలకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏసీ రామేశ్వర రెడ్డి, ఏపీఎంలు, వెలుగు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మృతుడికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.



సీసీ ఆనంద్ కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, వెలుగు సిబ్బంది

ఐదుగురి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని పి.వీరన్నపల్లిలో రెండు రోజుల క్రితం రైతు రెడ్డప్పరెడ్డి పొలంలో 150 మామిడి చెట్ల నరికివేత కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోపాల్, శ్రీనివాసులు, రాఘవేంద్ర, వెంకటస్వామి, నాగభూషణను ఆదివారం అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు వెల్లడించారు.

ఘనంగా నారాయణుడి కల్యాణోత్సవం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామసమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా కల్యాణోత్సవాన్ని అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, సునీల్‌కుమార్ శర్మ, బాలసుబ్రహ్మణ్య శర్మ ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి వేడుకలను వీక్షించారు. ప్రతి నెలా భక్తుల కోరిక మేరకు పౌర్ణమి రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. అలాగే గురుపౌర్ణమి పురస్కరించుకుని నరసాపురం, చిన్నపప్పూరు, రామకోటి, ముచ్చుకోట గ్రామాల్లోని షిర్డిసాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నపప్పూరులో సాయినాథుని దర్శనం కోసం విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకుడు, సీవీ రామన్ విద్యాసంస్థల చైర్మన్ బిందెల భాస్కర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయి

- జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు

వజ్రకరూరు: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుతారని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు అన్నారు. ఆదివారం రాగులపాడు గ్రామంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆలిండియా బంజారా సేవా సంఘం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా, వైద్య సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు బా లాజీనాయక్, వజ్రకరూరు మండల గౌరవ అధ్యక్షుడు నాగరాజునాయక్, ప్రధాన కార్యదర్శి పూజారి బాబు నాయక్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌నాయక్, కోశాధికారి పర మేష్‌నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేష్‌నాయక్, వజ్రకరూరు మండల అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, కార్యదర్శి వెంకటేష్‌నాయక్, కోశాధికారి అంజినాయక్ పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జరగనుంది. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, తదితరులు ఫిర్యాదులు స్వీకరిస్తారు. నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని సచివాలయంలో కార్యక్రమం జరుగుతంది.

రాప్తాడులో..

రాప్తాడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సీతారాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.